సాక్షి సూర్యాపేట

సోమవారం । 8 । జూలై । 2024



పేద కుటుంబానికి కష్టం

బరాఖత్‌గూడేం గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబానికి పెద్ద కష్టమొచ్చింది. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. - 8లో



పెండింగ్ డీఏలను ప్రకటించాలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ నేత రాములు డిమాండ్ చేశారు. - 10లో

గరిష్టం / కనిష్టం

36° / 23°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఐ ఆత్మహత్యపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోట గోపి

భానుపురి (సూర్యాపేట): దళిత ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య ఘటనపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై వివక్ష, వేధింపులపై అశ్వరావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ 25 రోజుల క్రితం జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా సరైన సమయంలో స్పందించకపోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. ఈ సంఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి పోలీస్ శాఖలో జరుగుతున్న కుల వివక్ష, వేధింపులకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో రాష్ట్ర పోలీస్ శాఖ, ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లానాయకులు సైదులు, సుధాకర్, నాగమణి, దుర్గారావు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దుచేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆవుల నాగరాజు, నాయకులు

సూర్యాపేట టౌన్: విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దుచేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. విద్యా వ్యాపారంపై రూపొందించిన కరపత్రాలను ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యను కాషాయీకరించి అంగట్లో సరుకుగా మార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలని, అందరికీ సమానమైన నాణ్యతతో కూడిన ఉచిత విద్యను శాస్త్రీయంగా అందించాలని కోరారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల గడిచినా విద్య, ఉద్యోగాల ఆకాంక్ష నెరవేరలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగాన్ని రక్షిస్తామని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి, విద్యా వ్యాపారాన్ని అడ్డుకుంటామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రైవేట్‌లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, రాజేందర్, నవీన్, నాగరాజు, అజయ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూస్తాం



గోదాములో బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాములు

హుజూర్‌నగర్: ప్రజా పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాములు అన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు హుజూర్‌నగర్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదామును ఆదివారం ఆయన తనిఖీ చేశారు. హుజూర్‌నగర్ ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ డీలర్లకు లారీల ద్వారా బియ్యం సరఫరా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి, స్టేజీ-2 కాంట్రాక్టర్‌ను అనుమానితులుగా పోలీసుల అదుపులోకి తీసుకున్నందున ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రేషన్ బియ్యం లారీలను డీలర్లకు పంపుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీటీసీఎస్ రాజశేఖర్ ఉన్నారు.

సూర్యక్షేత్రంలో జిల్లా ప్రధాన జడ్జి పూజలు



జడ్జికి స్వామి చిత్రపటం బహూకరిస్తున్న జనార్దన్‌స్వామి

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంతోపాటు అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర విశిష్టతను క్షేత్ర వ్యవస్థాపకుడు, సూర్య ఆరాధకులు జనార్దన్‌స్వామి తెలియజేశారు. అలాగే న్యాయమూర్తిని శాలువాతో సన్మానించి సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో రోజువారీ ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. యజ్ఞశాలలో మహాసౌర హోమాన్ని నిర్వహించారు. ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, క్షేత్ర సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణతంతు పూర్తి చేశారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళా శక్తి చాటేలా!

- వ్యాపార రంగంలో మహిళలు స్థిరపడాలని..
- రుణ చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- 14 రకాల వ్యాపారాలను గుర్తించిన అధికారులు
- జిల్లాకు 8,623 యూనిట్లు మంజూరు
- ప్రాథమికంగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి



భానుపురి (సూర్యాపేట): మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళాశక్తి పేరుతో రుణాలు అందించాలని సంకల్పించింది. ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ మహిళలు తమకు నచ్చిన వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనిస్తున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మహిళలు వ్యాపార రంగంలోనూ తమ శక్తిని చాటేలా వ్యాపార యూనిట్లు మంజూరు చేసింది. దీంట్లో భాగంగా జిల్లాలో మహిళాశక్తి కార్యక్రమాన్ని వేగవంతం చేసింది.

14రకాల వ్యాపారాల గుర్తింపు

రాష్ట్ర స్థాయిలో అమలు కానున్న ఈ పథకానికి జిల్లాలో 14 రకాల వ్యాపారాలను నేరుగా ప్రభుత్వమే గుర్తించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఏ వ్యాపారాలు, ఏ మండలం.. ఎన్ని యూనిట్లు అవసరం అన్నదానిపై ప్రణాళిక ప్రకారం యూనిట్ల మంజూరు జరిగింది. 14రకాల వ్యాపారాలను జిల్లాలోని 23 మండలాల్లో అమలు చేయనుండగా.. 8,623 యూనిట్లను మంజూరు చేసింది. ప్రధానంగా 14రకాల వ్యాపారాలు ఉన్నాయి. ఇందులో యూనిఫాం కుట్టే కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది.

పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక

జిల్లాలోని 23 మండలాల్లో 18,163 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 1,81,258 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాకు మంజూరైన 8,623 యూనిట్లను 9,764 మంది సభ్యులకు కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకు 7,261 యూనిట్లు, 8,418 మందికి చొప్పున మొత్తం 84.21 శాతం ప్రాథమిక స్థాయిలో డీఆర్‌డీఏ అధికారులు.. లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో కొన్ని వ్యాపారాలకు శిక్షణ అవసరం ఉండగా.. వారికి 15 నుంచి 45 రోజుల పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించనున్నారు. మిగతా లబ్ధిదారులను ఎంపిక చేసి ఆగస్టు 15 తేదీ నాటికి యూనిట్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

వ్యాపారం యూనిట్	యూనిట్లు మంజూరు	ఎంపిక చేసింది	కేటాయించాల్సిన లబ్ధిదారులు	ఎంపికైన లబ్ధిదారులు
మైక్రో ఎంటర్‌ప్రైజెస్	4,972	3,223	4,972	3,223
యూనిఫాం కుట్టడం	34	34	712	712
పాడి పశువులు	1,000	1,109	1,000	1,109
పెరటి కోళ్ల పెంపకం	2,300	2,572	2,300	2,572
కోళ్ల ఫాం	23	23	23	23
ఫిష్‌రిటైల్ అవుట్‌లెట్స్	1	8	5	8
మిల్క్ ప్యాలెస్	1	2	1	2
మీసేవ సెంటర్లు	48	46	48	46
ఈవెంట్‌మేనేజ్‌మెంట్	1	1	21	1
క్యాంటీన్లు	5	5	40	48
సోలార్ యూనిట్	1	1	396	396
ప్లాస్టిక్ వేస్ట్‌మేనేజ్మెంట్	1	1	10	10
ఫుడ్ ప్రాసెసింగ్	220	220	220	220
కస్టం హైరింగ్‌యూనిట్	16	16	16	16
మొత్తం	8,623	7,261	9,764	8,418

కొర్లపహాడ్‌లో ట్రామా కేర్

క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించేందుకు ఏర్పాటు

- అధునాతన సౌకర్యాలతో టోల్‌ప్లాజా వద్ద నిర్మాణం
- అందుబాటులో నిష్ణాతులైన వైద్యులు
- హైవేపై మరణాల రేటు తగ్గించడమే లక్ష్యం



కేతేపల్లి : కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద అత్యాధునిక వసతులతో కూడిన ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించాలని ఏడీపీ ప్రతిపాదించింది. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురైన సమయంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించే లక్ష్యంతో ఈ సెంటర్ నిర్మాణం చేపడుతోంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే కొర్లపహాడ్ టోల్‌ప్లాజాను కీలక జంక్షన్‌గా గుర్తించిన ఏడీపీ ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

గోల్డెన్ అవర్‌లో అందనున్న వైద్యం

65వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీతోపాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మొదటి గంటలో అందించే వైద్యాన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో క్షతగాత్రులను తక్షణ వైద్యం అందిస్తే ప్రాణాలు కాపడడానికి వీలుంటుంది. ప్రమాద బాధితులను సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించేందుకు జాప్యం జరుగుతుండటంతో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.

నిష్ణాతులైన వైద్యులు

క్షతగాత్రులకు తక్షణం వైద్యం అందించి ప్రాణాలు కాపాడే లక్ష్యంతోనే కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం బాధితుల ఆరోగ్య పరిస్థితిని బట్టి పెద్ద ఆస్పత్రులకు తరలిస్తారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించటంతో పాటు ప్రమాదం జరిగిన సమయానికి, చికిత్సకు మధ్యగల సమయాన్ని గణనీయంగా తగ్గించటమే ఈ సెంటర్ ఏర్పాటు ప్రాథమిక ఉద్దేశం. ఈ సెంటర్‌లో వైద్యం అందించేందుకు నిష్ణాతులైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇక్కడ అధునాతన వైద్య పరికరాలు కూడా ఉంటాయి.

ప్రాణాలకు రక్షణ

నకిరేకల్–సూర్యాపేట పట్టణాల మధ్య జాతీయ రహదారిపై కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుతో ప్రమాద బాధితులను అత్యవసర వైద్య సేవలను అందించటంతో కీలకంగా కానుంది. ట్రామాకేర్ సెంటర్ టోల్‌ప్లాజా సమీపంలో ఉండటం వల్ల క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లోనే వైద్య అందించే వీలుంది. దీంతో మరణాలను సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఈ సదుపాయం బాధితుల ప్రాణాలను రక్షించటంతో పాటు వారికి అవసరమై సంరక్షణ కల్పించటంలో కీలకపాత్ర పోషిస్తుంది.

ఏడీపీ అంటే..

ఏడీపీ అనేది బిజినెస్ అవుట్ సోర్సింగ్, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలో సొల్యూషన్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొవైడర్. 75 సంవత్సరాల అనుభవంతో 140 దేశాల్లో వివిధ రకాలుగా సేవలు అందిస్తుంది. భారతదేశంలో 11వేల అసోసియేట్‌లతో హైదరాబాద్, పూణే, చెన్నై నగరాల్లో విస్తరించి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ప్రపంచ స్థాయి సేవలను అందించడం, అత్యంత నిమగ్నమైన సంస్కృతిని నిర్మించటం, సంరక్షించటం, సమ్మిళిత పని వాతావరణాన్ని కల్పించడమే సంస్థ ప్రధాన ఉద్దేశం.

నేడు మంత్రి చేతుల మీదుగా భూమి పూజ



ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న నల్లగొండ ఆర్డీఓ రవి

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం భూమిపూజ చేయనున్నారు. సెంటర్ ఏర్పాటు కోసం టోల్‌ప్లాజా వద్ద విజయవాడ వైపు అరెకరం స్థలం గుర్తించారు. ఈ స్థలంలో భూమిపూజ ఏర్పాట్లను నల్లగొండ ఆర్డీఓ ఎస్.రవి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.

భూసార పరీక్షలకు..

- నాలుగు రోజులుగా మట్టి నమూనాల సేకరణ పనులు ప్రారంభం
- పైలట్ ప్రాజెక్టుగా చిలుకూరు మండలం ఎంపిక
- ఫలితాల ఆధారంగా రైతులకు అందించనున్న భూ ఆరోగ్య కార్డులు



చిలుకూరులో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

హుజూర్‌నగర్: భూసార పరీక్షల నిమిత్తం వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాల సేకరణకు శ్రీకారం చుట్టారు. సాగు భూముల్లో పోషకాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా పంటలు వేస్తే చీడపీడల నుంచి రక్షింపబడడమే కాకుండా అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. ఆ దిశగా రైతులను సమాయత్తం చేసేందుకు కేంద్రప్రభుత్వం 2024–25 సంవత్సరానికి మట్టి నమూనాలు సేకరించాలని ఆదేశించింది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు రాష్ట్రంలో అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడిన మండలాల్లో జిల్లాకు ఒకటి చొప్పున పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మట్టి నమూనాల సేకరణపై ఏఈఓలకు గత వారమే శిక్షణ ఇచ్చారు. సేకరించిన మట్టి నమూనాల ఫలితాలతో రైతులకు భూ ఆరోగ్యకార్డులను అందించనున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా చిలుకూరు మండలం

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా చిలుకూరు మండలాన్ని ఎంపిక చేశారు. ఈ మండలంలో ఈనెల 4న మట్టి నమూనాల సేకరణ పనులు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఈనెలాఖరు వరకు కొనసాగనుంది. ఐదెకరాలకు ఒక మట్టి నమూనా చొప్పున మండలంలో మొత్తం 4,808 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దానిలో 25 శాతం మట్టి నమూనాలనే సేకరించాలని నిర్ణయించారు. సాధారణంగా భూసార పరీక్షలకు మే నెలలో మట్టి నమూనాలను సేకరిస్తారు. ఈసారి సీజన్ ప్రారంభమైన మట్టి నమూనాల సేకరణ లక్ష్యాన్ని 1,202కు కుదించారు. దీంట్లోభాగంగా ఇప్పటివరకు 163 నమూనాలను మాత్రమే సేకరించారు.

జియోట్యాగింగ్ పద్ధతిలో సేకరణ

మట్టి నమూనాల సేకరణ సాయిల్ హెల్త్ కార్డు (ఎస్‌హెచ్‌సీ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని దాని ద్వారా జియోట్యాగింగ్ పద్ధతిలో సేకరిస్తారు. ఏఈఓ తన క్లస్టర్ పరిధిలోని పొలం వద్దకు వెళ్లి రైతు ఫొటో, పేరు, సర్వే నంబర్, సెల్ నంబర్, గతేడాది వేసిన పంట, వాడిన ఎరువుల వివరాలను నమోదు చేస్తారు. నమూనాలను భూసార పరీక్ష కేంద్రంలో అందజేస్తే ఈనెలాఖరులోగా విశ్లేషణ చేస్తారు. ఆగస్టు రెండో వారంలోగా ఫలితాలను ఆయా రైతులకు అందించాల్సి ఉంటుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



భూసారం తెలుసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి. ప్రస్తుతం చిలుకూరు మండలంలో మట్టి నమూనాల సేకరణ పనులు కొన సాగుతున్నాయి.

– జి.శ్రీధర్‌రెడ్డి, డీఏఓ, సూర్యాపేట

యాదాద్రిలో ఆరాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు కోలాహలంగా సాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం సేవ, ఆరాధన పూజలు చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



యాదాద్రిలో భక్తుల సందడి

యాదాద్రి క్షేత్రానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మాడవీధుల్లో సందడి నెలకొంది

ఏళ్ల తరబడి కాంట్రాక్ట్‌లోనే..!

ఈసీ ఏఎన్‌ఎంల సేవలను గుర్తించని ప్రభుత్వాలు

- డీఎస్‌సీ–2002 ద్వారా నియామకం
- క్రమబద్ధీకరణకు నోచక, కనీస వేతనాల్లేక అవస్థలు
- డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, కమిషనర్లకు వినతి
- పోరుబాట పట్టేందుకు సిద్ధం



ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి వస్తున్న ఈసీ ఏఎన్‌ఎంలు (ఫైల్)

భువనగిరి : 22 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతూ, చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈసీ (యూరోపియన్ స్కీం) ఏఎన్‌ఎంలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డీఎస్‌సీ(డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ) ద్వారా 2002లో రూ.3,550 వేతనంతో విధుల్లో చేరారు. అప్పటి నుంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 మంది ఈసీ ఏఎన్‌ఎంలుగా కొనసాగుతున్నారు. ఇందులో యాదాద్రి భువనగిరి 16, సూర్యాపేట 24, నల్లగొండ జిల్లాలో 33 మంది పనిచేస్తున్నారు.

మెరిట్ ఆధారంగా నియామకం

ఉమ్మడి రాష్ట్రంలో పారా మెడికల్ ఉద్యోగాల భర్తీలో భాగంగా 2002లో డీఎస్‌సీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. పాసైన వారికిఅదే ఏడాది మెరిట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో పీహెచ్‌సీ సెంటర్లలో ఏఎన్‌ఎంలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2007, 2008లో అప్పటి ప్రభుత్వం కొంతమందిని రెగ్యులరైజేషన్ చేసింది. అనంతరం కొంతమందిని నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా యూరోపియన్ కమిషన్ స్కీంకు బదిలీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొంత మందిని రెగ్యులరైజేషన్ చేశారు.

డిమాండ్లు ఇవే..

- రెగ్యులరైజేషన్ చేసి వేతనాలు అందిచాలి.
- పనిభారం తగ్గించాలి
- గర్భిణులకు, చిన్నారులకు అందించే వైద్యసేవలపై ఆన్‌లైన్‌లో కాకుండా బుక్‌లో నమోదు చేయాలి.

అధికారులకు వినతిపత్రాలు అందజేత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈసీ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న 73 మందిని రెగ్యులర్ చేయాలని పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓలో పాటు శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు.

వేతనాల కోసం ఎదురు చూపులు

జిల్లాలో ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఈసీ ఏఎన్‌ఎంలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2002లో రూ.3,550, 2008లో రూ.5,200, 2010లో రూ.10,200, 2018లో 21,230, 2022లో రూ.27,399 చొప్పున వేతనాలు అందిస్తూవచ్చారు. అయితే గత ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మెడికల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు 22 ఏళ్లుగా ఈసీ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్నాం. రాత్రి 11గంటల వరకు ట్యాబ్‌లో వివరాలు నమోదు చేయవల్సి వస్తోంది. కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నాం. ప్రభుత్వం మా పనిని గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

–విజయలక్ష్మి, ప్రజారోగ్య ఉద్యోగుల యూనియన్ నేత

మళ్లీ పరీక్ష నిర్వహించవద్దు



ఈసీ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసేందుకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదు. 22 ఏళ్లుగా పని చేస్తున్నాం. పరీక్షల రాయాలంటే 49 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని సూచించారు. పనిచేస్తున్న వారిలో 50 ఏళ్ల వయస్సు పైబడిన వారు సైతం ఉండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది.

–ఏ సుమతి, ఈసీ ఏఎన్‌ఎం, యాదాద్రి జిల్లా

క్లుప్తంగా

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

చివ్వెంల(సూర్యాపేట): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామానికి చెందిన పెద్దపోలు శ్రీనివాస్(40) కొంత కాలంగా గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా సమస్య గ్యాస్ట్రిక్ సమస్య తగ్గకపోవడంతో శనివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు కేబుల్ వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య గమనించి స్థానికుల సహాయంతో సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కనకరత్నం తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇస్కిళ్ల గ్రామంలో వృద్ధుడు..

రామన్నపేట: మండలంలోని ఇస్కిళ్ల గ్రామానికి చెందిన వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్కిళ్ల గ్రామానికి చెందిన అన్నారపు యాదయ్య(65) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితం మీద విరక్తితో శనివారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

బీబీనగర్ ఏయిమ్స్‌లో తేనెటీగల భయం

- ఆందోళన చెందుతున్న రోగులు



ఏయిమ్స్ భవనానికి ఉన్న తేనెటీగలు

బీబీనగర్: బీబీనగర్ ఏయిమ్స్‌కు వస్తున్న రోగులను తేనెటీగల భయం వెంటాడుతోంది. ఎయిమ్స్ భవనాల మధ్యన ఓపీ విభాగం పక్కనే వైద్యం కోసం వచ్చే రోగులు, వారి వెంట వచ్చే కుటుంబ సభ్యులు సేద తీరేందుకు పార్కును ఏర్పాటు చేశారు. ఈ పార్కు చుట్టూ ఉన్న పాత భవనాలకు లోపల మాత్రమే మెరుగులు దిద్ది వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. కానీ బయట గోడలను అలాగే వదిలేశారు. దీంతో బాల్కానీ గోడల చుట్టూ తేనెటీగలు తొట్టిలను ఏర్పాటు చేశాయి. ఏయిమ్స్‌కు వీఐపీలు వచ్చినప్పుడు శబ్దాలు వస్తుండడంతో తేనెటీగలు లేచి వస్తుండడంతో అక్కడే ఉండే రోగులు భయాందోళనకు గురవుతున్నారు. చుట్టూ వైద్య సేవలు కొనసాగుతుండడం, ప్రజలు ఉంటుండడంతో తేనె తొట్టిలను తొలగించడం లేదు. ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఏయిమ్స్‌కు వచ్చినప్పుడు తేనె తొట్టిలను చూసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే భవనాల మధ్యన గోడల్లో పెరిగిన చెట్లు తొలగించాలని ఏయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. రోగులు, వారితో పాటు వచ్చే వారు, వైద్య విద్యార్థులు పార్కులోకి వెళ్లలేకపోతున్నారు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- రెండు కిడ్నీలు చెడిపోయి ఆస్పత్రిలో చేరిన కుమారుడు
- వైద్యం కోసం రూ.2.50లక్షలు అప్పు చేసిన తల్లిదండ్రులు
- మెరుగైన చికిత్స కోసం మరో రూ.5లక్షలు అవసరమని చెప్పిన వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

కన్నీటి గాథ

మునగాల(కోదాడ): రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. ఎంతో హుషారుగా ఉండే కుమారుడు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవ్వడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వైద్యం చేయించి తమ కుమారుడిని కాపాడుకోవడం శక్తికి మించిన భారం కావడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మాదాసు నాగయ్య, భాగ్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు దిలీప్, రెండో కుమారుడు గౌతమ్. నాగయ్య టైలర్‌గా, భాగ్యమ్మ విలేజ్ బుక్ కీపర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారి పెద్ద కుమారుడు దిలీప్ డిగ్రీ పూర్తి చేసి పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. వారం రోజుల క్రితం దిలీప్‌కు జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి దిలీప్‌కు కామెర్లు ముదిరి కిడ్నీలకు ఇన్‌ఫెక్షన్ సోకిందని గుర్తించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లేదా ఖమ్మం తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో దిలీప్‌ను తల్లిదండ్రులు ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అతడిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయి కాళ్లు చచ్చుబడిపోవడంతో ఖరీదైన వైద్యం అందించాల్సి ఉంటుందని సూచించారు. హ్యూమన్ నార్మల్ ఇమ్యూనోగ్లోబిలిన్ ఇమ్యూనోరెల్ అనే ఇంజక్షన్లు ఐదు రోజుల పాటు 12 డోసులు ఇవ్వాల్సి ఉంటుందని, ఒక్కో ఇంజక్షన్ డోసు ఖరీదు రూ.19వేలు ఉంటుందని వైద్యులు దిలీప్ తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో .2.50లక్షల వరకు అప్పుచేసి చికిత్స చేయిస్తున్నారు. దిలీప్ పూర్తిగా కోలుకోవాలంటే మరో రూ.5లక్షల వరకు అవసరం ఉంటుందని వైద్యులు చెప్పడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కుమారుడి ప్రాణాలు కాపాడేందుకు దాతలు సాయం చేయాలని వేడుకుంటున్నారు.



ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్‌కుమార్

దాతలు సాయం చేయాల్సిన వివరాలు..
బ్యాంక్ అకౌంట్ నంబర్: 73141963945
ఏపీజీవీబీ, మునగాల బ్రాంచ్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఏపీజీవీ0006210
ఫోన్ పే నంబర్: 8186824023

నా కుమారుడి ప్రాణాలు కాపాడండి



చేతికి అందొచ్చిన కుమారుడు కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకుంటే అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని మా కుటుంబానికి వైద్యం చేయించే స్తోమత లేదు. దయార్ధ హృదయులు ఆర్థికసాయం చేసి మా కుమారుడి ప్రాణాలు కాపాడండి.

– మాదాసు నాగయ్య, దిలీప్ తండ్రి

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- రైలు కింద పడి బలవన్మరణం



నాగేంద్రబాబు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: అప్పుల బాధతో ఆటో డ్రైవర్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం దుర్గానగర్‌కు చెందిన నానాపురం నాగేంద్రబాబు(35) గత 15సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు చరణ్, అఖిల్ ఉన్నారు. ఆటో కొనేందుకు తెచ్చిన అప్పు తీరకపోవడం, రోజురోజుకు ఆటో గిరాకీ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. తెలిసిన వారి వద్ద తెచ్చిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన నాగేంద్రబాబు ఆదివారం ఉదయం మిర్యాలగూడ పట్టణ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి జేబులో ఉన్న ఐడెంటిటీ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి..

నాగేంద్రబాబు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ ఆటో మోటార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ నాజర్ అలీ డిమాండ్ చేశారు. నాగేంద్రబాబు కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం వలన ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, ఆటోల్లో ప్రయాణికులు ఎక్కకపోవడంతో కిస్తీలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని అన్నారు. ఆటోల్లో ప్రయాణికులను చేరవేస్తే ప్రభుత్వమే చార్జీలు చెల్లించేలా ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆటో యూనియన్ కార్మికులున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

అడ్డగూడూరు: బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం అడ్డగూడూరు మండలం చౌల్లరామారం గ్రామ స్టేజీ వద్ద జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌల్లరామారం గ్రామానికి చెందిన నాగెల్లి స్వామిదాసు గ్రామ స్టేజీ వద్ద వలిగొండ–తొర్రూర్ జాతీయ రహదారి వెంట నిర్మించిన డ్రెయినేజీ దిమ్మెపై కూర్చున్నాడు. అక్కడే జనగామ జిల్లా కొడకండ్ల మండలం దేవరుప్పులకు చెందిన జోగు యాదలక్ష్మి బస్సు కోసం వేచి చూస్తుండగా.. అదే సమయంలో మోత్కూర్ మండలం కొండగడప గ్రామానికి చెందిన బోడ యాదగిరి ద్విచక్ర వాహనంపై తిరుమలగిరికి వెళ్తూ వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగెల్లి స్వామిదాసు కుడికాలు విరగగా.. యాదలక్ష్మి మోకాలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన బోడ యాదగిరి ద్విచక్ర వాహనాన్ని ఆపకుండా వెళ్తుండగా.. స్థానికులు వెంబడించి మండలంలోని చిర్రగూడూరు గ్రామ స్టేజీ వద్ద పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బైక్ పైనుంచి జారి పడి..

మోత్కూరు: రోడ్డు నిర్మాణంలో భాగంగా పోసిన కంకర మీదుగా వెళ్తున్న బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం సమీపంలో మోత్కూరు–భువనగిరి మెయిన్ రోడ్డుపై ఆదివారం జరిగింది. గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన చిన్నబోయిన మల్లయ్య, చిన్నబోయిన రాములు బైక్‌పై భువనగిరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం సమీపంలోకి రాగానే రోడ్డుపై పోసిన కంకర మీదుగా బైక్ వెళ్తుండగా బైక్ అదుపు తప్పడంతో వారిద్దరు కిందపడియోయారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని..

కోదాడరూరల్: బైక్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కోదాడ మండలం కాపుగల్లులో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం చెడ్లకుంటకు చెందిన ఇసుక ట్రాక్టర్ కాపుగల్లు మీదుగా వెళ్తూ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సమీనా అనే బాలిక కాలుకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. ప్రమాదం జగిన తర్వాత ట్రాక్టర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లేందుకు ప్రయత్నించగా.. గ్రామస్తులు ట్రాక్టర్‌ను అడ్డగించారు.

పుస్తెలతాడు అపహరించిన దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ యాదయ్య

చింతపల్లి: మహిళ మెడలో పుస్తెలతాడు అపహరించిన ఇద్దరు దొంగలను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నాంపల్లి పోలీస్ స్టేషన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలెంపల్లి గ్రామానికి చెందిన కొర్ర తుల్సానాయక్ రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తుల్సానాయక్‌కు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన ధరావత్ బాలకృష్ణ స్నేహితుడు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన గోరేటి బక్కమ్మ జూన్ 26వ తేదీన గ్రామ పరిధిలోని తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా.. తుల్సానాయక్, బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై ఆమె వద్దకు వెళ్లి మాటల్లో పెట్టి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై అటుగా వెళ్తున్న తుల్సానాయక్, బాలకృష్ణపై అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి బంగారు పుస్తెలతాడు, ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనం కూడా నిడమనూరు మండల కేంద్రంలో గత నెల 18వ తేదీన చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వీరికి సహకరించిన రమావత్ వంశీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ యాదయ్య, సిబ్బంది సైదులు, కిరణ్, శివకుమార్, రాంబాబును డీఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

12క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని కేశవనగర్‌కు చెందిన ధీరావత్ సోని టిక్యాతండాలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. కొందరు ఈ విషయాన్ని 100 నంబరుకు ఫోన్ చేసి చెప్పడంతో మిర్యాలగూడ రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ధీరావత్ సోని రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కాపుగల్లు శివారులో 90 కేజీలు..

కోదాడరూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం కోదాడ మండలంలోని కాపుగల్లు శివారులో కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నారం గ్రామానికి చెందిన సాంబశివరావు కోదాడ మండలం కాపుగల్లులో 90 కేజీల రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి టీవీఎస్ ఎక్సెల్‌పై తీసుకెళ్తుండగా.. కాపుగల్లు శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సాంబశివరావుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

భువనగిరి క్రైం: పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉద్ది శంకరయ్య ఆదివారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. వ్యవసాయ బావి వద్ద కడీలకు ఏర్పాటు చేసిన కరెంట్ తీగలకు వెంకటయ్య తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మధ్యాహ్నం 12గంటల వరకు వెంకటయ్య ఇంటికి రాకపోవడంతో అతడి భార్య, కుమార్తె వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా శంకరయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడి భార్య ఉద్ది లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తెతో పాటు కుమారుడు ఉన్నారు.

ఎస్ఐ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట: దళిత ఎస్ఐ మృతికి కారకులైన అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, ఐదుగురు కానిస్టేబుళ్లను ఉద్యోగం నుంచి తొలగించి హత్యా నేరం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తళ్లమల్ల హసేన్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐ జితేందర్‌రెడ్డి, ఐదుగురు కానిస్టేబుళ్లకుల అహంకారం వల్ల అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాసు అవమానానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందాడని అన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బోయల అఖిల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నామా వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవ చేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు



లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

నేరేడుచర్ల: సేవ చేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ప్రతిఒక్కరూ సమాజ సేవను అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అధికారి అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్ల పట్టణంలో జరిగిన నేరేడుచర్ల లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1917లో ప్రారంభమైన లయన్స్ క్లబ్ నేడు 210 దేశాలకు విస్తరించిందని, క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అనేక మంది నిరుపేదలకు అండగా నిలిచిందన్నారు. నేరేడుచర్లలో లయన్స్ క్లబ్ 2001లో ప్రారంభమై నాటి నుంచి నేటి వరకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ కూడా మంచి స్ఫూర్తితో ముందుకు వెళ్లి గుర్తింపును తీసుకురావాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు జిలకర రామస్వామి, కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి యూసుఫ్‌తో పాటు కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ వైస్ గవర్నర్–2 ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సుంకరి క్రాంతికుమార్, కందిబండ శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కొణతం సీతారాంరెడ్డి తదితరులున్నారు.

సమీకృత సేంద్రియ వ్యవసాయ క్షేత్రం సందర్శన



సిరిపురంలో సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన డీలర్లు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్ సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో 2023–24బ్యాచ్‌లో శిక్షణ పొందుతున్న దేశీ డీలర్లు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే ఇన్‌చార్జ్ సీహెచ్. నరేష్ మాట్లాడుతూ.. తక్కువ భూమిలో అనేక రకాల పంటలు పండిస్తూ, తక్కువ పెట్టుబడితో నిత్యం ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫెసిలిటేటర్ పి. శంకర్‌రావు, అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని వ్యక్తి బలవన్మరణం

చివ్వెంల(సూర్యాపేట): మద్యానికి బానిసైన వ్యక్తి తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామానికి చెందిన గుడ్డెటి మహేష్(28) అతడి భార్య నాగలక్ష్మికి మధ్య ఆరునెలల క్రితం గొడవ జరగడంతో ఆమె తన తల్లిగారి ఊరు గాయంవారిగూడేనికి వెళ్లింది. అప్పటి నుంచి మహేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మహేష్‌ను శనివారం అతడి తల్లి ఎల్లమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన అతడి తల్లి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి చికిత్స నిమిత్తం మహేష్‌ను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కనకరత్నం తెలిపారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి



అల్పాహారం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామన్నపేట: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు బుగ్గ దేవేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, స్పోర్ట్స్ మెటీరియల్‌ను సరఫరా చేయాలన్నారు. సకాలంలో నోటు పుస్తకాలు, డ్రెస్‌లు, బెడ్‌షీట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, మాస శ్రీనివాస్, ముత్యాల స్వామి, గురుకు సైదులు, ముగ్గు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా స్నేహితులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన జెట్టి వెంకన్న ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జెట్టి వెంకన్నకు కాళ్లు, చేతులు, అతడి భార్య, కుమార్తె కాలు విరిగింది. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జెట్టి వెంకన్న స్నేహితులు వారి కుటుంబ దీనస్థితిని చూసి వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం రూ.1,10,000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఈదుల అరుణ్, దర్శనం రమేష్, సట్టు భద్రయ్య, తోట మహేష్, సంతోష్, నరేష్, పి. రవి, ఏ. రవి, సోనియా, స్వరూప, చారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అడ్డంకులు తొలగేనా!

భువనగిరి పరిధిలో ట్రిబుల్ ఆర్ భూ సేకరణకు కసరత్తు

- హైకోర్టులో స్టే వెకేట్ చేయించే ప్రయత్నాల్లో అధికారులు
- అలైన్‌మెంట్ మార్చాలంటున్న రైతులు
- చౌటుప్పల్ వద్ద అదనపు భూ సేకరణకు చర్యలు



అలైన్‌మెంట్ మార్చాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సాక్షి, యాదాద్రి : భువనగిరి, చౌటుప్పల్ పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణకు అధికారులు కసరత్తు వేగిరం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా మిగిలిపోయిన భూసేకరణకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో భువనగిరి మండల పరిధిలోని రాయగిరి రైతులు హైకోర్టులో వేసిన స్టేను వెకేట్ చేయించే ప్రయత్నాల్లో వారున్నారు. ఈ మేరకు కలెక్టర్ హనుమంతు కే.జెండగే పలుమార్లు రెవెన్యూ అధికారులతో సమావేశం అయ్యారు. రైతులతోనూ చర్చలు జరిపి వారిని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. సంగారెడ్డి నుంచి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్ జిల్లాల్లోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో గల 24 గ్రామాల పరిధిలో 59.33 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం 649 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందులో యాదాద్రి జిల్లా పరిధిలో 50 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. భూ సేకరణకు అడ్డంకులు తొలగితే వెంటనే త్రీడీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

అలైన్‌మెంట్ మార్చాలంటున్న భువనగిరి మండల రైతులు

రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం అలైన్‌మెంట్ మార్చాలని భువనగిరి మండలం రైతులు ఎంతోకాలంగా కోరుతున్నారు. హైకోర్టు ఆశ్రయించడంతో వారికి స్టే వచ్చింది. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకాగాంధీ, అప్పటి ఎంపీ, ప్రస్తుత రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రస్తుత ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు మరికొందరు కాంగ్రెస్ ముఖ్య నేతలు పార్టీ అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇక్కడి రైతులు అలైన్‌మెంట్ మారుతుందన్న ఆశతో ఉన్నారు. ఆదివారం మరోమారు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమారెడ్డిని కలిసి అలైన్‌మెంట్ మార్చాలని విన్నవించారు. మరోవైపు కోర్టు స్టేను వెకేట్ చేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ రహదారి సంస్థ చర్యలు చేపట్టింది. భూ సేకరణ పూర్తయితే వెంటనే టెండర్లు పిలిచేందుకు జాతీయ రహదారి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

భూసేకరణ నిలిచిపోయిన గ్రామాలివే..

రాయగిరి రైతులు తమ గ్రామ పరిధిలో భూ సేకరణ చేయవద్దని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఇంటీరియమ్ స్టే ఆర్డర్ ఇచ్చింది. దీంతో భువనగిరి పరిధిలోని రాయగిరితో పాటు కేసారం,పెంచికలపహాడ్,తుక్కాపూర్, గౌసనగర్, ఎర్రంబెల్లి గ్రామాల పరిధిలో 64.02 గుంటల భూసేకరణ నిలిచిపోయింది. కోర్టు తీర్పు ప్రకారం ముందుకెళ్తామని అధికారులు చెబుతున్నారు.

చౌటుప్పల్ పరిధిలో అదనంగా సేకరించనున్న భూమి

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చౌటుప్పల్ వద్ద ఏర్పాటు చేయనున్న జంక్షన్‌ను భవిష్యత్ అవసరాల దృష్ట్యా మరింత విస్తరించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో చౌటుప్పల్, లింగోజిగూడెం, తంగెడపల్లి పరిధిలో 5.64 కిలో మీటర్ల పరిధిలో భూసేకరణ నిలిచిపోయింది. అదనపు భూ సేకరణకు చేయాల్సి ఉంది. 73.8995 హెక్టార్ల భూమి సేకరించడం కోసం త్రీ (ఏ) నోటిఫికేషన్ ఇవ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో చౌటుప్పల్ పరిధిలో 66.04 హెక్టార్లు, లింగోజిగూడెంలో 1.1147 హెక్టార్లు, తంగెడపల్లిలో 6.7448 హెక్టార్లు, 4.93 హెక్టార్ల భూమి సేకరించనున్నారు.